వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

భూములపై 'సోలార్' కన్ను

- రైతుల నుండి కారుచౌకగా కొట్టేస్తున్న సోలార్ కంపెనీలు
- భూములపై రైతులు హక్కులను కోల్పోకండి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆలూరు

సోలార్ కంపెనీలు దళారులను పెట్టుకొని రైతులకు మాయమాటలు చెప్పి, నమ్మించి భూములను కారు చౌకగా కొట్టేస్తున్నారని ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆలూరులోని జ్యోతిబసు భవన్‌లో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు అధ్యక్షతన 'సోలార్ కంపెనీల కుట్రలు, వాటి వలన రైతులకు అవుతున్న నష్టం' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సోలార్ కంపెనీలు రైతుల భూములను సంవత్సరానికి ఎకరాకు రూ.30 వేలకు లీజుకు, లేదా ఎకరాకు రూ.5.25 లక్షలకు కొనుగోలు చేస్తామని గ్రామాల్లో ఏజెంట్ల ద్వారా ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాగే పంటలు పండటం లేదని, చౌడు భూములనే వివిధ కారణాలతో కొందరు రైతులు భూములు అమ్మేందుకు సిద్ధపడుతున్నారని అన్నారు. రైతులు తొందరపడి సోలార్ కంపెనీలకు భూములు లీజుకు, అమ్మకానికి ఇవ్వవద్దని, ఒక వేళ ఇస్తే మీ పిల్లల బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. 5 ఎకరాల భూమిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సోలార్ కంపెనీకి సంవత్సరానికి సుమారుగా రూ.75 లక్షల నుండి రూ.80 లక్షల వరకు ఆదాయం పొందితే రైతుకు మాత్రం 5 ఎకరాలకు లీజు కింద సోలార్ కంపెనీ 1 లక్ష 50 వేలు మాత్రమే ఇస్తుందన్నారు. సోలార్ కంపెనీ విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే భూమినే వారికి ప్రధానమైన వనరు అన్నారు. భూమి లేకుంటే సోలార్ కంపెనీ పెట్టలేరని, విద్యుత్ ఉత్పత్తి చేయలేరన్నారు. వారు లాభాలు కూడా గడించలేరని చెప్పారు. రైతుకు ఒక్క సారి ఎకరాకు రూ.5 లక్షలు ఇచ్చి కొనుగోలు చేస్తే జీవిత కాలం సోలార్ కంపెనీకి సంవత్సరానికి రూ.16 లక్షల లాభం పొందే అవకాశం ఉందన్నారు. రైతులు మీ భవిష్యత్తును, పిల్లల భవిష్యత్తును ఫణంగా పెట్టి భూములను సోలార్ కంపెనీలకు ఇవ్వాలనే ఆలోచన చేయవద్దన్నారు. రైతుల బాగు కోసం నిలబడి పోరాడే రైతు సంఘం మీకు అండగా ఉంటుందన్నారు. భూమిపై జీవిత కాలం హక్కు కోల్పోవద్దన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం, సోలార్ కంపెనీల ముందు రైతులు ఈ డిమాండ్స్ పెట్టాలని రైతు సంఘం కోరుతుందన్నారు. రైతులంతా ఐక్యమత్యంగా రైతు సంఘంగా ఏర్పడితే ఏ శక్తి, ఏ ప్రభుత్వం ఏమి చేయలేదన్నారు. న్యాయం కోసం పోరాడి మెరుగైన రేటు, కౌలు సాధించు కుందాన్నారు. సోలార్ కంపెనీల లాభాలలో వాటా సాధించుకుందామని, మన బిడ్డలకు బంగారు భవిషత్తు ఇద్దామని రైతులను కోరారు. సోలార్ కంపెనీలకు భూములు ఇవ్వాలంటే సంవత్సరానికి ఎకరాకు కనీసం రూ.50 వేలు కౌలు ఇవ్వాలని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 20 శాతం కౌలు పెంచాలన్నారు. అగ్రిమెంట్ కాల పరిమితి గరిష్టంగా 10 సంవత్సరాలకు మించకుండా ఉండాలన్నారు. ప్రభుత్వం రైతులకు సోలార్ కంపెనీలకు మధ్యవర్తిత్వంగా ఉండాలన్నారు. కౌలు సందర్భంలో భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు రైతుల దగ్గరే ఉండాలని చెప్పారు. జిరాక్స్ కాపీలు మాత్రమే సోలార్ కంపెనీలు తీసుకోవాలని తెలిపారు. భూమి కొనుగోలు విధానంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలన్నారు. పంటలు పండని, చౌడు భూములకు ఎకరాకు రూ.10 లక్షలు, పంటలు పండే భూములకు ఎకరాకు రూ. 20 నుండి 25 లక్షలు ఇవ్వాలన్నారు. సోలార్ కంపెనీలు పొందే లాభాలలో 10 శాతం వాటా లాభం భూములు ఇచ్చిన రైతులకు సోలార్ ఉన్నంత కాలం ఇవ్వాలని తదితర డిమాండ్స్‌పై ఒప్పుకుంటేనే కంపెనీలకు భూములు ఇద్దామని, లేకపోతే కారుచౌకగా కట్టబెట్టొద్దని రైతులకు సూచించారు. రైతులకు న్యాయమైన డిమాండ్‌లకు ఒప్పుకుంటేనే సోలార్ కంపెనీలు ఏర్పాటవుతాయని, లేకపోతే కంపెనీల మోసాలను ఎండగట్టి రైతులను ఏకం చేసి పోరాడుతామన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సి. నారాయణ రెడ్డి మాట్లాడారు. అనంతరం రైతులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని నిరసన తెలిపారు. సోలార్ కంపెనీల మోసాల నుండి ప్రభుత్వం జోక్యం చేసుకొని 2013 భూ చట్టం ప్రకారం రైతులకు పరిహారం ఇప్పించాలని కోరుతూ తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ఆలూరు, ఆస్పరి, హొళగుంద, పత్తికొండ, హాలహర్వి మండల కార్యదర్శులు ఈరన్న, రంగస్వామి, వెంకటేశులు, సిద్ధ గౌడ్, ధనుంజయ, సిఐటియు సీనియర్ నాయకులు కెపి. నారాయణ స్వామి, ఆయా మండలాల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న నేతలు

ఎటిఎం అంతరాష్ట్ర దొంగలు అరెస్టు

- కంటైనర్ వాహనాల డ్రైవర్ల ముసుగులో వరుస నేరాలు
- పలు రాష్ట్రాల్లో ప్రధాన నిందితుడిపై 26 కేసులు, మరో నిందితుడిపై 15
- జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వరుసగా ఎటిఎం మిషన్లను తొలగించి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతరాష్ట్ర నిందితులను కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ.. హర్యానా రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు కార్లను రవాణా చేసే కంటైనర్ వాహనాల డ్రైవర్ల పేరుతో బయటికి కనిపిస్తూ అంతర్గతంగా ఏటిఎం మిషన్లను పెకిలించి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. గత నెల ఫిబ్రవరి 24న అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామ సమీపంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటిఎం కేంద్రం పై భాగంలో ఉన్న షట్టర్‌ను ఒక టూయింగ్ వాహనంతో బలవంతంగా లాగి, లోపల ఉన్న ఎటిఎం మిషన్‌కు తాళ్లు కట్టి బయటకు లాక్కొని పోవడానికి ప్రయత్నిస్తూ స్థానిక యువకులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. స్థానిక యువకులను చూసిన దొంగలు అక్కడి నుండి టోయింగ్ వాహనంలో పరారయ్యారని చెప్పారు. కర్నూల్ టౌన్ డిఎస్‌పి, రూరల్, ఉలిందకొండ, ఓర్వకల్లు ఎస్‌ఐలు ఎటిఎంను సందర్శించారన్నారు. వెంటనే దొంగల ఆచూకీ కోసం వెతకగా టూయింగ్ వాహనం పులిందకొండ క్రాస్ రోడ్డు తర్వాత ఎన్‌హెచ్-44 రోడ్డుపై ఆగి ఉండాన్ని గుర్తించారని తెలిపారు. వాహన వివరాలను పరిశీలించగా ఆ వాహనాన్ని అదే రోజు కర్నూలు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగ తనంగా తీసుకెళ్లి ఏటిఎం చోరీకి ఉపయోగించినట్లు తెలిసిందన్నారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీస్ స్టేషన్లో కేసును నమోదు చేశామన్నారు. దర్యాప్తులో పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారని చెప్పారు. నిందితులు కర్నూలులో ఒక కంటైనర్ వాహనం ద్వారా ప్రయాణించి తిరిగి బెంగళూరు వైపుగా ప్రయాణిస్తున్నట్లు నిర్ధారించుకొని, ఆ వాహనం కదలికలు, దాని వివరాలను కనుక్కున్నారని తెలిపారు. ఆ వాహన కంపెనీ యజమాని ద్వారా డ్రైవర్ వివరాలను సేకరించారన్నారు. డ్రైవరు సెల్‌ఫోను స్వాధీనం చేసుకొని అతనితో పాటు ఉన్న ఇతర ముగ్గురు వ్యక్తుల వివరాలను సేకరించామన్నారు. నిందితులు షాహిద్ ఖాన్, షావుకార్ ఖాన్, జంషద్ ఖాన్ హర్యానా రాష్ట్రం నోహు మేవత్ జిల్లా రాయిపరి చెందిన వారు కాగా, మరో నిందితుడు సుని ఇమ్రాన్ ఖాన్ పాల్వాల్ జిల్లా గ్రామానికి చెందిన వాడిగా గుర్తించామన్నారు.

చెట్లమల్లాపురం వద్ద దాబాలో నిందితుల అరెస్టు : నిందితుల కోసం కర్నూల్ డిఎస్పి ఆధ్వర్యంలో కర్నూలు రూరల్ సిఐ, మూడో పట్టణ సిఐ, ఉలిందకొండ ఎస్ఐ, ఓర్వకల్లు ఎస్ఐలను నాలుగు బృందాలుగా నియమించి గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం మేరకు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు సిబ్బందితో కలిసి నిందితులను శుక్రవారం ఉదయం 6:30 గంటలకు కల్లూరు మండలం చెట్లమల్లాపురం సమీపంలో ఎన్‌హెచ్-44 పక్కన ఉన్న సామ్రాతాల్ రాజస్థాన్ డాబా వద్ద అరెస్టు చేశారన్నారు. వారి వద్ద నుండి గ్యాస్ కట్టర్, చిన్న గ్యాస్ సిలిండర్, రెండు కత్తులు, దొంగ తాళాలు, మాస్కులు, గ్లౌజులు, రెండు స్ప్రే టిన్నులు, కూలింగ్ అద్దాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పలు రాష్ట్రాల్లో నేరాలు : నిందితులు హర్యానా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో నేరాలు చేసినట్లుగా తేలిందన్నారు. నిందితుడు షాహిద్ ఖాన్ 26, ఇమ్రాన్ ఖాన్ 15 ఎటిఎం దొంగతనాలు చేసినట్లు అంగీకరించారన్నారు. మిగిలిన ఇద్దరు నేరస్తుల గురించి విచారణ కొనసాగుతుందన్నారు. అరెస్టు సమాచారాన్ని అన్ని రాష్ట్రాలకు పంపించామన్నారు.

మహిళలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలి

- డిఆర్‌ఒ సి.వెంకటనారాయణమ్మ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహిళా ఉద్యోగులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని డిఆర్‌ఒ సి.వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం మైదానంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, ఏపీ జెఎసి వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళా క్రీడా పోటీలను డిఆర్‌ఒ ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖలలో విధులు నిర్వహించే దాదాపు 150 మంది మహిళలు టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, షటిల్, త్రో బాల్, టగ్ ఆఫ్ వర్, షాట్ పుట్, షటిల్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు ఇవ్వనున్నట్లు డిఆర్‌ఒ తెలియజేశారు. కార్యక్రమంలో సర్వజన ప్రభుత్వ వైద్యశాల ఏవో సింధు సుబ్రహ్మణ్యం, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ యాని ప్రతాప్, ప్రెసిడెంట్ దీప, ఏపీ జెఎసి అమరావతి ఉమెన్ వింగ్ చైర్ పర్సన్ సహారాబాను, జనరల్ సెక్రటరీ పద్మావతి, ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సరస్వతి, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డిఆర్‌ఒ సి.వెంకటనారాయణమ్మ

ఇంటర్ పరీక్షలను కలెక్టర్ తనిఖీ

- ఆరుగురు విద్యార్థులు డీబార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టర్

కర్నూలు నగరంలోని జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా గురువారం తనిఖీ చేశారు. ఉస్మానియా కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే ద్వితీయ సంవత్సరం జరిగిన పరీక్షల్లో కర్నూల్ నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతుండగా అధికారులు పట్టుకుని డీబార్ చేశారు.

సోమన్న ఆశయ సాధనకు కృషి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా పని చేసి అనారోగ్యంతో మరణించిన సోమన్న ఆశయ సాధన కోసం పని చేయడమే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ పేర్కొన్నారు. గురువారం కర్నూలులోని కార్మిక కర్షక భవనంలో సోమన్న మూడవ వర్ధంతి సభ కర్నూలు మండల కమిటీ కార్యదర్శి పిబి హుసేనయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా సోమన్న చిత్రపటానికి జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు కెవి నారాయణ, పిఎస్ రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు కె.అరుణ, సోమన్న సతీమణి ఎస్.నాగలక్ష్మిలు పూలమాలవేసి నివాళు లర్పించారు, అనంతరం డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ సోమన్న విద్యార్థి దశ నుండి పేపర్ మిల్లు ఉద్యమం పోరాటాల అనుభవాలు చూసి, ఉద్యమాలకు ఆకర్షితుడై యువజన సంఘం, వ్యకాసం, సిపిఎం మండల, డివిజన్ స్థాయి బాధ్యతలను, జిల్లా కమిటీ సభ్యుడిగా చివరిదాకా జెండా పట్టుకుని పనిచేశారన్నారు. నిస్వార్థపరుడిగా, పార్టీ ఆశయాల కోసం, ప్రజల సంక్షేమం కోసం, ప్రజా పోరాటాల్లో ముందుండి పని చేసిన సోమన్న నేటి కార్యకర్తలకు ఆదర్శమని అన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పజెప్పినా వెనక్కి వెళ్లకుండా పని చేసుకుంటూ ముందుకుపోయే తత్వం కలిగిన వ్యక్తి అన్నారు. కార్యకర్తలతో, ప్రజలతో మమేకమై పని చేసిన వ్యక్తి సోమన్న అన్నారు. సోమన్న ఆశయ సాధనకు పని చేయడమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు, ఎండి ఆనంద్ బాబు, ఎం.రాజశేఖర్, కర్నూలు మండల కార్యకర్తలు బీసన్న, నరసింహ, చెన్నయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సోమన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పిస్తున్న డి.గౌస్ దేశాయ్ తదితరులు

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

12న చలో విజయవాడ : వ్యకాస

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఈనెల 12న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ కోరారు. గురువారం రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఈ.తాండ్రపాడు సర్పంచి ఎస్.బాలపీరా, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఉపాధ్యక్షులు కె.లింగన్న, బి.బాలకృష్ణ, డి.రామాంజనేయులులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. మాబాష, అశోక్, మధు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 12న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న కోరారు. ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యకాస ప్రతినిధి బృందం పరిశీలించింది. వ్యకాస మండల నాయకులు రామస్వామి పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'ను అమలు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అరుణ, ఎన్.అలివేలమ్మ కోరారు. గురువారం నగరంలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా వార్డు కార్యదర్శి ఎం.కుమారి అధ్యక్షతన సభ జరిగింది. వారు ముఖ్యఅతిథులుగా హాజరయి మాట్లాడారు. మహిళలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసే విధంగా, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న ధరల భారాలను, విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకులు పిఎస్.సుజాత, జె.కిరణ్మయి, ఐద్వా వార్డు నాయకులు ఎన్.సావిత్రమ్మ, పి.పర్వీన్, పి.నోమేశ్వరి, బి.జమున, పద్మ, యూన్సీ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

భాష్యంలో ఫిష్ట కల్చరల్ డే

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని ఎస్‌విఎస్ ఫంక్షన్ హాలులో గురువారం ఫిష్ట కల్చరల్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డబ్ల్యు.సీతారాం (న్యూరో సర్జన్), డాక్టర్ ఎల్.పార్వతి (ప్లాస్టిక్ సర్జన్) హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. ఉన్నత స్థాయిని అధిరోహించాలని తెలిపారు. అతిథుల చేతుల మీదుగా అకాడమిక్ టాపర్లు, అటెండెన్స్ టాపర్లకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ కె.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ ఎం.సురేఖ, భాష్యం పాఠశాల సిఇఒ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కర్నూలు మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగినులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆరోగ్యం, సాధికారత సాధించాలని తెలిపారు. మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన వాలీబాల్, టెన్నికాయిట్, రన్నింగ్, రోప్ పుల్లింగ్ వంటి అవుట్ డోర్ క్రీడల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంతో పాల్గొన్నారు. ఎపిజిఇఎ మహిళా విభాగం అధ్యక్షులు సావిత్రి బాయి, సెక్రటరీ నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 సావిత్రిబాయి, ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్, సెక్రటరీ సురేష్ రెడ్డి, ట్రెజరర్ పవన్, సూపరింటెండెంట్ సునీత, ట్యూటర్ నారాయణమ్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, మురళీధర్ నాయుడు, చిన్ని కృష్ణ, హసన్, ఆంజనేయులు, నాయక్, జయమ్మ, మెహబూబీ, జానకి పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

అశోకా ఉమెన్స్ కళాశాలలో

అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సాచీ-2025 వేడుకను వైభవంగా నిర్వహించారు. మహిళల ప్రతిభను గుర్తించి, వారు సాధించిన విజయాలను గౌరవించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరితంగా సాగింది. ముఖ్య అతిథులుగా సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజ్ డీన్ వై.శౌరీలు రెడ్డి, సామాజిక కార్యకర్త విజయ భారతి హాజరయ్యారు. శౌరీలు రెడ్డి మాట్లాడుతూ... ప్రతి మహిళా తన ప్రయాణాన్ని స్వయంగా తీర్చిదిద్దుకోవాలని, ధైర్యంగా ముందుకు సాగి విజయాలను సొంతం చేసుకోవాలని తెలిపారు. విజయ భారతి మాట్లాడుతూ... పెద్ద కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ ఏడాది వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 12 మంది మహిళలను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఇంట్రెప్రెనేర్ సస్య ముప్పా, కృష్ణాపురం జగతి రెడ్డి, దివ్యా రెడ్డి, ఫ్యాషన్ రంగం మూలా శిరిహ రెడ్డి, విద్యా రంగం డాక్టర్ కె.శాంత, డాక్టర్ సి.విజయ సురే, డాక్టర్ ఎం.ఇందిరా శాంతి, కళారంగం డి.భువనేశ్వరి, క్రీడారంగం జాఫ్రీన్ షేక్, న్యాయ వ్యవస్థ ఎస్.నజీమా కౌసర్, సాంకేతిక రంగం మజేటి అన్విత, వైద్య రంగం డాక్టర్ శ్రవ్య రాజశేఖర్‌లను సన్మానించారు. అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ సిఇఒ డాక్టర్ హరీస్ కృష్ణ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నవీన్, కళాశాల ఛైర్మన్ కె.అశోక్ వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : రవీంద్రలో...

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కర్నూలు కలెక్టరేట్ : స్థానిక రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ముగ్ధ-2025 మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రారంభ వేడుకకు డైరెక్టర్ సిఎస్‌బిఐఎస్ అకాడమీ, ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాలవరపు బాలలత ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాల లత మాట్లాడుతూ... మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. కాలేజీ యాజమాన్యాన్ని, ప్రిన్సిపల్ డాక్టర్ కెఇ.శ్రీనివాసమూర్తిని అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- ఆర్‌టిసి రీజినల్ ఆఫీస్‌లో శ్రీచక్ర హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఆర్‌టిసి ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గురువారం ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీచక్ర హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీనివాసులు, శ్రీచక్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం.విజయ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. వేలాదిమంది ఆర్‌టిసి ఉద్యోగులు లక్షలాది ప్రజలను తమ గమ్యస్థానాలకు చేరుస్తుంటారని, అలాంటి వారు నిత్యం ఆరోగ్యంగా ఉండాలని.. వైద్య పరీక్షలు చేసుకుంటూ ఉండాలని తెలిపారు. జబ్బులను గుర్తించి అనారోగ్యాల బారిన పడకుండా ఉండడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. గుండె, కళ్ళు, కీళ్ల నొప్పులు చెక్ చేసుకుంటూ ఉండాలన్నారు. గుండెకు సంబంధించి చిన్న, చిన్న వైద్య పరీక్షలు ఈసీజీ, టూడి ఇకో వంటివి చేయించుకోవడం ద్వారా హార్ట్ ఎటాక్‌ను ముందుగానే గుర్తించి ప్రమాదం నుంచి బయటపడవచ్చని తెలిపారు. గతంలో 250 మందిని పరీక్షిస్తే 20 మందికి రిస్క్ ఫ్యాక్టర్ ఉందని గుర్తించి వారు చికిత్స తీసుకుని ప్రమాదం నుంచి బయటపడ్డారని తెలిపారు. మరిన్ని పరీక్షలు శ్రీచక్ర హాస్పిటల్‌లో చేయించుకోవాలని, ఈహెచ్‌ఎస్ ద్వారా ఉద్యోగులకు వైద్యం అందుబాటులో ఉందని చెప్పారు. ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ... శ్రీచక్ర హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు అభినందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో టుడి ఇకో, ఈసీజీ, బీపీ, షుగర్, జనరల్ చెకప్, కంటి పరీక్షలు నిర్వహిం చారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఓ.రామ పక్కీరప్ప, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ షఫీ, ఆర్‌టిసి సీనియర్ మెడికల్ ఆఫీసర్ రోజా రమణి, హెడ్ నర్స్ రమణమ్మ, ఆర్‌టిసి పర్సనల్ ఆఫీసర్ సర్దార్ హుస్సేన్, శ్రీచక్ర హాస్పిటల్ మేనేజర్ సురేంద్ర, కళ్యాణ్, ఆప్తమాలజీ టెక్నీషియన్ ఫైజుల్, కార్డిక్ టెక్నీషియన్ రామాంజి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి

యూత్ పార్లమెంట్ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

నగరంలోని సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి యూత్ పార్లమెంటరీ గోడపత్రికను ప్రిన్సిపల్ డాక్టర్ కె.శాంత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సివి.సత్యానారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లాస్థాయి యూత్ పార్లమెంటరీ పోటీలు నిర్వహించేందుకు తమ కళాశాలను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు యువ పార్లమెంట్ పోటీలను జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర అసెంబ్లీ, దేశ పార్లమెంట్లో మాట్లాడే అవకాశం కల్పించాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.వెంకటేశ్వర్లు, ఎ.మల్లికార్జున, ఎస్.స్వాతి, కల్యాణి పాల్గొన్నారు.

ప్రతి కూలీకీ ఉపాధి కల్పించాలి : ఏపీడీ

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలో పని అడిగిన ప్రతి కూలీకీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ అలీపీరా అధికారులకు సూచించారు. గురువారం ఉపాధి పనులను తనిఖీ చేసి పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలసలను నివారించాలంటే ప్రతి కూలీకీ పని కల్పించాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో వలస వెళ్లకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, అప్పుడే వలసలను నివారించవచ్చని చెప్పారు. ఏపీఓ రామన్న పాల్గొన్నారు.

డాక్టర్ అక్తర్ భానుకు 'ఉత్తమ పురస్కారం'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



క్లస్టర్ విశ్వవిద్యాలయం, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.అక్తర్ భాను ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని ఆమెట్ విశ్వవిద్యాలయం, చెన్నై నుంచి అందుకున్నారు. ఆమెట్ విశ్వవిద్యాలయం, రామచంద్రన్ మారిటైమ్ ఫౌండేషన్ సంయుక్తంగా దేశంలోని ప్రతిభావంతులైన మహిళా అధ్యాపకులను ఈ జాతీయ పురస్కారం కోసం చేసిన ఎంపికలో అక్తర్ భాను రాష్ట్రం నుంచి ఈ అవార్డును అందుకోవడం గర్వకారణం. ఆమె విశిష్ట బోధనా నైపుణ్యాలకు ఈ గౌరవం దక్కిందని గురువారం క్లస్టర్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.ప్రసాద రెడ్డి అభినందించారు.

ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలిన

ప్రజాశక్తి- దేవనకొండ

స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి నవ్య

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి గురువారం జెసి డాక్టర్ బి.నవ్య స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెర్నేకల్ గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరయిందని, నిర్మాణం చేపట్టేందుకు గ్రామంలో సర్వే నెంబర్ 313, గ్రామ కంఠం 46 సర్వే నెంబర్ గల స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో సర్వే నెంబర్ 313లో 1.10 ఎకరాల స్థలంలో ఆస్పత్రి నిర్మాణం చేపట్టేందుకు అనుకూలంగా ఉందని చెప్పారు. ఆస్పత్రి నిర్మాణం, గ్రామాభివృద్ధి కోసం గ్రామస్తులంతా కలిసి కట్టుగా ఉండి అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకప్ప, ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ ప్రసాద్ రాజు, సర్పంచి అరుణ్ కుమార్, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సుదర్శనం, పంచాయతీ కార్యదర్శి రాముడు, విఆర్‌ఒలు హనుమాన్, సర్వేయర్ షఫీ పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

- ఏపీడీ పద్మ, ఏపీఓ జుబేర్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తున్న పద్మ, జుబేర్ అహ్మద్

ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి పనులు చేస్తున్న దగ్గర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని ఆలూరు ఏపీడీ బి.పద్మ, ఏపీఓ జుబేర్ అహ్మద్ ఉపాధి కూలీలకు తెలిపారు. గురువారం నగరడోన గ్రామంలో ఉపాధి పనులు చేసుకునే ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పనులను, ఫారంపండ్స్ పనులను తనిఖీ చేశారు. తమకు సకాలంలో వేతనాలు అందడం లేదని ఉపాధి కూలీలందరూ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వచ్చే వారంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయన్నారు. ఎవరూ అపోహ పడవద్దని తెలిపారు. ఉపాధి చట్టం ప్రకారం పని ప్రదేశాల్లో కూలీలకు సురక్షిత తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, వైద్య సేవలు వంటి సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని ఏపీఓకు ఆదేశాలు ఇచ్చారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఉదయం 6 గంటల్లోపు పని ప్రదేశాలకు వెళ్లి 11 గంటల్లోపు పని ముగించేలా చూసుకోవాలని కూలీలకు సూచించారు. ఎండల తీవ్రత కూలీల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున కూలీల సౌలభ్యం మేరకు పని సమయాలు ఉండాలన్నారు. ఈసీ మారుతి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మన్న పాల్గొన్నారు.

షాపుల సమయం పెంచాలి

- డీఎస్పీకి ముస్లిం జెఎసి వినతి

ప్రజాశక్తి - ఆదోని



డీఎస్పీ హేమలతకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలో రాత్రి 11.30 వరకు టీ స్టాల్, కూల్ డ్రింక్ షాపులు తెరిచేందుకు అనుమతి ఇవ్వాలని ఆదోని ముస్లిం జెఎసి నాయకులు కోరారు. గురువారం ఆదోని డీఎస్పీ హేమలతకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి, ముస్లిం జెఎసి కన్వీనర్ నూర్ అహ్మద్ మాట్లాడారు. ఉపవాసం ఉన్న ముస్లింలు సాయంత్రం, రాత్రి తరావీలో ఎక్కువగా ప్రార్ధన చేస్తారని తెలిపారు. తర్వాత టీ లేక చల్లని పానీయాలు తాగి సేదతీరతారని చెప్పారు. ఆదోనిలో ఎప్పుడూ లేని విధంగా పోలీసులు ఈ రంజాన్‌లో రాత్రి 10.30 గంటల్లోపే షాపులు మూసి వేయిస్తూ ఉండడంతో ముస్లింలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ అసాధారణ పరిస్థితి గురించి ఎస్పీ విక్రాంత్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాత్రి 11 గంటల వరకు దుకాణాలు తెరచుకోవచ్చని, 11.30 గంటల వరకు పరిమితి పెంచేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారన్నారు. సహకరించిన డీఎస్పీ హేమలతకు కృతజ్ఞతలు తెలిపారు. జెఎసి నాయకులు వసీమ్ సాహెబ్, ఖాదర్ బాష, అబు బాకర్, న్యాయవాదులు సద్దాం, మహ్మద్ వసీమ్ పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మంత్రి ఫరూక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ శాఖ మంత్రి కెఎమ్‌డి.ఫరూక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మిగనూరులో నూతన కోర్టు భవనం నిర్మాణం గురించి, మైనార్టీ సంక్షేమం, సమస్యల గురించి మంత్రికి విన్నవించారు.

అక్రమ కట్టడాల తొలగింపు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ నడిబడ్డలో ఉన్న శ్రీనివాస భవన్ నుంచి వన్ టౌన్ వరకు మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి ఉన్న వాటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జెసిబిల సహాయంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీనివాస్ భవన్ ముందు రోడ్డు ఆక్రమించి ఉన్న వాటిని తొలగించారు. మున్సిపాలిటీకి సంబంధించిన మురుగు కాలువను, అక్కడి నుంచి వాటిపై చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. ప్రధాన రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే రోడ్డులో ఆక్రమణలు తొలగించడం వల్ల ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు రాకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. అక్రమ కట్టడాలు తొలగించిన శిథిలాలతో రోడ్డు మొత్తం నిండిపోయింది. కొంతమందికి దుకాణదారులు ఆక్రమణలను అడ్డుకొని తమకో న్యాయం.. పెద్దలకో న్యాయం చేస్తున్నారని, పేదలను అన్యాయం చేస్తున్నారని వాపోయారు. అందరికీ ఒకే ప్రకారం చేయాలని వాదించారు. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా శ్రీనివాస భవన్‌తో పాటు ఆ ప్రాంతంలోని అక్రమ కట్టడాలను తొలగించాలని అనేకమంది ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. శ్రీనివాస భవన్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడం వల్ల అసలు రోడ్డులో ఉన్న ఈ భవనాన్ని తొలగించాలని ఒక ఆటో డ్రైవర్ తన ఆటోను రోడ్డులో ఉంచి నిరసన చేపట్టారు. పూర్తిస్థాయిలో ఈ ప్రాంతంలో అక్రమ కట్టడాలను తొలగించాలని, అవసరమైతే ఇక్కడ మున్సిపాలిటీ అధికారులు స్థలాన్ని కొనుగోలు చేసి కట్టడాలను తొలగిస్తే తప్ప ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు చిత్తశుద్ధితో అక్రమ కట్టడాలను తొలగించాలని, నామమాత్రంగా చేయరాదని విమర్శిస్తున్నారు. కేవలం ప్రజల దృష్టిని మళ్లించడానికే పాలకులుగా ఇలా చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

బాబా మెడికల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ

బాబా మెడికల్ ఏజెన్సీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని గాంధీ నగర్‌లో బాబా మెడికల్ ఏజెన్సీని డీఎస్పీ ఉపేంద్ర బాబు ప్రారంభించారు. గురువారం బాబా మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు బాబా జబీవుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ ఏజెన్సీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ఉపేంద్ర బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సేవలు అందించడానికి ముందుకు వస్తున్న వారికి సహకారం అందించాలని కోరారు. మెడికల్ ఏజెన్సీని నిరంతరం ప్రజలకు ఉపయోగపడే విధంగా చూసుకోవాలని తెలిపారు. డాక్టర్ నరహరి రెడ్డి, ఎమ్మిగనూరు పట్టణ మెడికల్ షాపుల అసోసియేషన్ అధ్యక్షులు నరహరి శ్రీనివాస రెడ్డి, నరహరి శశిధర్ రెడ్డి, మమత మెడికల్ షాప్ పకీర్ సాబ్, రాఘవేంద్ర మెడికల్ షాప్ నాగరాజు, యాపిల్ ల్యాబ్ నిర్వాహకులు కె.బీరప్ప, టిడిపి మైనారిటీ నాయకులు బడే సాబ్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు రంగస్వామి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని అగసనూరు గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ఆంధ్ర వైపు ఉన్న సరిహద్దుల్లో, కర్ణాటక రాష్ట్రం తమాపూర్ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. వందలాది వాహనాల్లో ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. ఆంధ్రా సరిహద్దుల్లో ఉన్నప్పటికీ ఇక్కడ సరైన నిఘా లేకపోవడంతో ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తులు ఆపడానికి వెళితే వారిపై దాడులు చేయడానికి సిద్ధపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. గతంలో సాతనూరు సమీపంలో కూడా ఇలాగే ఇసుక అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక వాసులను గ్రామస్తులు అడ్డుకోవడానికి వెళితే దాడులు చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. అక్రమంగా ఇసుక తరలిస్తున్న కర్ణాటక వాసులపై ఆంధ్రా అధికారులు స్పందించి ఇసుక దోపిడీని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుంగభద్ర నదిలో ఇసుక తోడుతున్న కర్ణాటక వాసులు

మూడు రోజులు ప్రత్యేక తరాబి నమాజులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని పాత బస్తీలో ఉన్న లవ్ బాలి దర్గా ఆవరణలోని మసీదులో రంజాన్ మాసం సందర్భంగా ప్రత్యేక తరాబి నమాజులు చేయనున్నారు. ఈనెల 7, 8, 9న (ప్రత్యేకత నమాజు) ఉంటుంది. ఈ నమాజులు ది ఖురాన్ అకాడమీ ఫౌండర్ రిజ్వాన్ బాషా ఖాద్రీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పరీక్షా సమయంలో ఆందోళన వద్దు

- రోటరీ క్లబ్ అధ్యక్షులు, కౌన్సిలర్ సందీప్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పరీక్షలు రాసే సమయంలో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉంటూ ప్రతిభ చాటాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసే 270 మంది విద్యార్థినులకు గురువారం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, సభ్యులు సునీల్ రెడ్డి, వినోద్ జైన్, భరత్ షా, సాబీర్ బాషా, హుస్సేన్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థినులకు సేవా కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు అందించినట్లు తెలిపారు. పది పరీక్షల్లో గతేడాది 15 మంది విద్యార్థినులు 550 మార్కులు సాధించి హై స్కూల్‌కు రాష్ట్రవ్యాప్తంగా పేరు తీసుకొచ్చారని, ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ డిఇఒ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

తెర్నేకల్‌లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఈనెల 11న జరగనున్న శ్రీలక్ష్మీ చెన్న మాధవ స్వామి తిరుణాల సందర్భంగా తెర్నేకల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 10లోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9491869398, 9603044700 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు బాధాకరం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

'వైసిపికి చెందిన వారికి పని చేస్తే.. పాముకు పాలు పోసినట్లే' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించడం బాధాకరమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన నేత ఈ విధంగా మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తోందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ఆర్, జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఏ రోజూ ఇలా మాట్లాడలేదని, అలాంటి ఆలోచనలు చేయలేదని చెప్పారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ఆర్ కుటుంబానికే దక్కుతుందని కొనియాడారు. ప్రజలు అధికారం ఇచ్చింది మంచి చేయడానికే అని, మంచే చేయాలని తెలిపారు. హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలను, వైసిపి శ్రేణులను లక్ష్యంగా కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేయడం తగదని హితవు పలికారు. ఇలాంటి సంప్రదాయాలు మంచిది కాదని తెలిపారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలకు మంచి చేసి, సేవలు అందించి గుర్తింపు పొందాలని సూచించారు.

14న ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

- జనసేన నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్, జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకల కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయకర్త చింతా సురేష్ బాబు, జనసేన పార్టీ ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప కోరారు. గురువారం లక్ష్మీ రంగా కల్యాణ మండపంలో నియోజకవర్గ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో రూ.25 కోట్లకు పైగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. మరో రూ.25 కోట్లు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరుగుతున్న తొలి సభ కావడంతో జనసైనికులు, వీర మహిళలు రెట్టించిన ఉత్సాహంతో సభకు తరలి రావాలని కోరారు. రాష్ట్ర వాల్మీకి/బోయ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, కురువ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, జనసేన జిల్లా నాయకులు పిబివి.సుబ్బయ్య, రాయలసీమ జోన్-2 కార్యక్రమాల కార్యనిర్వహణ కమిటీ సభ్యులు బోయ గోవిందు, జనసేన మండల కన్వీనర్ వీరేష్, నాయకులు ఉచ్చీరప్ప, జగదీష్, చంటిబాబు, ఆంథోని పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆగని వలసలు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని దుద్ది గ్రామానికి చెందిన 20 కుటుంబాలు గురువారం పిల్లాపాపలతో కలిసి బతుకుదెరువు కోసం గుంటూరులో మిరప పంట కోతకు వలస వెళ్లాయి. ఇప్పటికే మండలంలోని ప్రతి గ్రామం నుంచి వలస వెళ్లడంతో గ్రామాలన్నీ ఖాళీ అయ్యాయి. కోసిగితో పాటు మండలంలోని నేలకోసిగి, వందగల్లు, దుద్ది, కోల్మన్ పేట, చింతకుంట, పల్లెపాడు, కామన్ దొడ్డి, సజ్జలగూడెం, డి.బెళగల్, చిన్నబొంపల్లి, పెద్ద బొంపల్లి, ఐరన్‌గల్లు తదితర గ్రామాలన్నీ సుగ్గి బాట పట్టాయి. స్థానికంగా పనులు లేకపోవడం, పొలం పనుల కోసం తెచ్చిన అప్పులు కట్టలేక.. పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక పిల్లాపాపలతో కలిసి వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మండలంలో మాత్రం వలసలూ ఆగడం లేదు. అధికారులు, రాజకీయ నాయకులు వాగ్దానాలు చేసి తప్పుతున్నారు. వలసలను నివారించడంలో శాశ్వత పరిష్కారం చూపడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు ఆలోచించి మండలంలో వలసలు నివారించేందుకు స్థానికంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తే కొంతవరకు వలసలను ఆపవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

బొలెరో వాహనంలో వలస వెళ్తున్న కూలీలు

రజకుల కల్యాణ మండపానికి నిధులివ్వండి

- జెఇఒకు కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి వినతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో రజకుల సౌకర్యార్థం కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి కోరారు. గురువారం తిరుమలలో టిటిడి జెఇఒ వెంకన్న చౌదరి ఛాంబర్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణ శివారులోని రామజల దోబీఘాట్ సమీపంలో రజక కల్యాణ మండపం రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించినట్లు తెలిపారు. రజకుల సొంత ఖర్చులతో పునాది వరకు నిర్మించుకున్నారని, మిగతా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను టిటిడి నిధుల నుంచి ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

కల్యాణ్‌ను విమర్శించే హక్కు జగన్‌కు లేదు

- జనసేన తాలూకా నాయకులు నాగరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని జనసేన తాలూకా నాయకులు బీసీ.నాగరాజు మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి కోడి కత్తికి ఎక్కువ, గొడ్డలికి తక్కువ అని, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని తెలిపారు. కనీసం అసెంబ్లీకి వెళ్లి ప్రజల గొంతు వినిపించని జగన్‌ను రాబోయే రోజుల్లోనూ ప్రజలు నమ్మరని, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని జగన్ కల్యాణ్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

వైభవంగా రాఘవేంద్రుని జన్మదిన వేడుకలు

- భక్తజన సందోహం మధ్య ఘనంగా స్వర్ణ రథోత్సవం
- మహా మంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి జన్మదిన వేడుకలు వైభవంగా సాగాయి. గురువారం శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి 430వ పుట్టిన రోజు సందర్భంగా రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేశారు. అనంతరం పూజారులతో పాటు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తులసి అర్చనతో మహా పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలతో అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణలో మంగళ హారతులు ఇచ్చారు. రాఘవేంద్రస్వామి మూర్తిని స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చి, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో భక్తజన సందోహం మధ్య ఘనంగా ఊరేగించారు. స్వామి వారి జన్మదిన వేడుకల్లో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాదాహార ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో సుమారు వందమంది సంగీత కళాకారులతో నిర్వహించిన సంగీతం భక్తులకు వీనులవిందు చేసింది. పీఠాధిపతులు కూడా వీణాదారుడై వీణా వాయిద్యం చేశారు. స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని మంగళహారతులు స్వీకరించారు.

స్వర్ణరథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంధం తెస్తున్న పీఠాధిపతులు

వైభవంగా బడేసాహెబ్ ఉరుసు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గంజిహళ్లి గ్రామంలో మహాత్మ శ్రీగంజిహళ్లి బడే సాహెబ్ ఉరుసు మహోత్సవం గురువారం వైభవంగా సాగింది. తెల్లవారుజామున పీఠాధిపతులు తమ ఇళ్ల నుంచి వైభవంగా గంధాన్ని దర్గాకు చేర్చడంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బడే సాహెబ్ తాత జీవ సమాధిని, దర్గాను పూలతో అందంగా అలంకరించారు. నూతన చద్దర్లను సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు, ప్రజలు దర్గాను సందర్శించి పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా రథోత్సవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వెలసిన శ్రీరామదేవర, శ్రీకాశీ విశ్వనాథ, శ్రీఆంజనేయస్వామి 18వ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం రథోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. నిర్వాహకులు ఆలయ ఆవరణలో భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. రథోత్సవం సందర్భంగా సాయంత్రం తేరును పూలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. తేరు సందర్భంగా ముందుగా తేరు వద్ద వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఇస్వి ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది బషీర్, రామయ్య, రామకృష్ణ, కిరణ్ బందోబస్తు నిర్వహించారు.

సారా రహిత ఆదోనికి కృషి

- ఎక్సైజ్ సిఐ సైదుల్

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఆదోని

సారా రహిత ఆదోనిగా మారుద్దామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ కోరారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్ ఏరియాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సారా తాగడం వల్ల శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడతారని తెలిపారు. సారా తయారీలో కెమికల్ లిక్విడ్ వేస్తున్నారని, వాటి జోలికి వెళ్లవద్దని పేర్కొన్నారు. నవోదయ 2.0లో భాగంగా సారా రహిత రాష్ట్రంగా మార్చాలని ప్రభుత్వం కంకణం కట్టుకుందని తెలిపారు. అందులో భాగంగానే తమ పరిధిలోని ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

'ఆశయ సాధనకు కృషి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ఉన్నతమైన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఉస్మానియా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రా జావేద్ తెలిపారు. గురువారం నగరంలోని ఉస్మానియా కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన ఉద్యోగ శిక్షణలో ఆమె పాల్గొని విద్యార్థులను చైతన్యపరిచి మాట్లాడారు. యు నెక్స్, ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సమీవుద్దీన్, ముజమ్మిల్ అధ్యక్షత వహించారు. ఉస్మానియా కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్, చేంజ్ మేకర్, హిమబిందు పాల్గొన్నారు.

ఆవాజ్ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రంజాన్ మాసం సందర్భంగా ఆవాజ్ నగర అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు, వితంతువులకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆవాజ్ కమిటీ నగర ఉపాధ్యక్షులు అబ్దుల్ నయీమ్, అబ్దుల్ దేశాయ్, ఇంతియాజ్, నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎమ్‌డి.షరీఫ్, ట్రెజరర్ ఇలియాజ్, ఆవాజ్ నగర నాయకులు షాజీర్ హుస్సేన్, మూస మియా, అబు బాకర్, సిద్దిక్, బాష హాజరయి మాట్లాడారు. గతంలో పేద ముస్లిం, మైనార్టీలకు రంజాన్ తోఫా మాదిరిగానే ఈఏడాది కూడా చంద్రన్న కానుక పేరుతో రంజాన్ తోఫాను అందించాలని డిమాండ్ చేశారు. దాదాపు 220 మంది పేద మహిళలకు, వితంతువులకు బియ్యం పంపిణీ చేశారు.



ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

రెండో అంతస్తులో ఎస్‌బిఐ

- ఖాతాదారులకు శాపంగా మారిన స్టేట్ బ్యాంకు

ప్రజాశక్తి - కోసిగి

గర్భిణీని మోసుకొస్తున్న భర్త

స్థానికంగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు శాపంగా మారింది. రెండో అంతస్తులో బ్యాంకు ఉండడంతో వృద్ధులు విద్యార్థులు, గర్భిణులు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బ్యాంకును కిందికి మార్చాలని గతంలో ప్రజా సంఘాల నాయకులు పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా బ్యాంకు అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం 6వ వార్డుకు చెందిన అంజలి అనే గర్భిణీ బ్యాంకులో పని నిమిత్తం మెట్లు ఎక్కి పైకి వెళ్లారు. 8 నెలల గర్భిణీ కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. గర్భిణీని చూసిన ఇతర ఖాతాదారులు, ప్రజలు బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులో ఉన్న ఖాతాదారులు, ఆమె భర్త స్పందించి ఆటోలో చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. జిల్లా అధికారులు స్పందించి బ్యాంకును రెండో అంతస్తు నుంచి కిందికి మార్చాలని కోరుతున్నారు.

లింగ నిర్ధారణపై ప్రకటనలిస్తే చర్యలు

- డిఎంహెచ్‌ఒ డాక్టర్ శాంతి కళ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

జిల్లా పరిధిలోని ప్రయివేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవని డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి.శాంతి కళ హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించేలా గోడపత్రికలు అంటించినా, హోర్డింగులు పెట్టినా, వాణిజ్య ప్రకటనలు చేసినా పిసి అండ్ పిఎన్‌డిటి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమిస్తే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని తెలిపారు.

మహారాజశ్రీ బనగానపల్లె సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No: 223/ 2021

కొడుదల లక్ష్మమ్మ. ...వాది

Vs

1.లక్ష్మీదేవి
2.దుబ్బా కలధర్ రెడ్డి
ఇద్దరి నివాసం, ప్లాట్ నెం: 52,
ఇంటి నెం: 4/167, లక్ష్మణ సింగ్ కాలనీ, కర్నూల్.
...ప్రతివాదులు

సమన్లు

పై కోర్టు దావాలో ప్రతివాదులు నెం 1&2 అయినా మీరు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించియున్నాను సమన్లను ముట్టనందువలన శ్రీ కోర్టు వారు పై దావాలో ప్రతివాదులు నెం 1&2 సమన్లు పత్రికా ప్రముఖంగా ప్రచురణ ద్వారా సమన్లు తెలియజేయవలసినదిగా ఆదేశించియున్నారు. కావున పై దావాలో ప్రతివాదులు నెం 1&2 కి సమన్లు అమలు జరుగుటకు శ్రీ కోర్టు వారి వుత్తర్వుల మేరకు ఈ పత్రిక ప్రచురణ జరిగినది. పై ప్రతివాదులు నెం 1&2 అయిన మీరు శ్రీ కోర్టు వారి ముందు హాజరు కావుటకు 12-03-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసియున్నారు. కావున పై తేదీన శ్రీ కోర్టుకు స్వయంగా కాని న్యాయవాది ద్వారా కానీ హాజరై తమ ఆక్షేపణలను తెలియజేసుకోనగలరు. లేని యెడల తమ పరోక్షమందు తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి వుత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 12-03-2025

బొబ్బల విక్రమ్ కుమార్ రెడ్డి,
న్యాయవాది,
బనగానపల్లి, నంద్యాల జిల్లా